శాసనసభ స్పీకర్‌గా నియమితులైన గడ్డం ప్రసాద్‌ను శుక్రవారం ఎమ్మెల్యే క్వార్టర్‌లో మార్వాడి శిక్ష సమితి కార్యదర్శి ఎస్.బి.కాబ్రా, లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రిథేశ్ జాగిర్ధార్ జైన్, ఆల్ ఇండియా ఓల్డ్ టెంపుల్ రినోవేషన్ ట్రస్ట్ చైర్మన్ ఆర్‌కే జైన్ శుభాకాంక్షలు తెలిపారు. **- సుల్తాన్‌బజార్, డిసెంబర్ 15**

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సచివాలయంలో ఆయన గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సీకే మూర్తి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీకే మూర్తి మాట్లాడుతూ.. మంత్రి ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. **- అబిడ్స్, డిసెంబర్ 15**

అభివృద్ధిని అందించడానికి కృషి

ప్రజలకు అభివృద్ధిని అందించడానికి కృషి చేసామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ అన్నారు. ఆసిఫ్‌నగర్ డివిజన్, వాల్మీకి నగర్‌కు చెందిన పలువురు నాయకులు శుక్రవారం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకుడు ఎండీ మూసా పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, డిసెంబర్ 15**

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌ను శుక్రవారం టోలీచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం, డిసెంబర్ 15

మానవ సేవే మాధవ సేవ

పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ముజీబ్‌హుస్సేనీ

సుల్తాన్‌బజార్,డిసెంబర్ 15 : మానవసేవే మాధవసేవగా రోగి సహాయకులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. శుక్రవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో మెహదీనవాబ్ జంగ్ (ఎంఎన్‌జే) క్యాన్సర్ దవాఖాన ఆవరణలో 500 మంది రోగి సహాయకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల పేరిట నెలలో నాలుగుసార్లు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర, సభ్యులు ఖాలేద్ అహ్మద్, శ్రీధర్‌నాయుడు, బి.శంకర్, ముఖీం ఖురేషి, దవాఖాన యూనిట్ కోశాధికారి చంద్ర శేఖర్, ఎస్సై యూనిట్ సభ్యులు రాజ్‌కుమార్, జిల్లా శాఖ ఏపీఆర్వో మహమ్మద్ అబ్దుల్ వహీద్, మహమ్మద్ ముస్తఫా షరీఫ్, మ హమ్మద్ హబీబ్ చావూష్ పాల్గొన్నారు.

సైఫాబాద్ సైన్స్ కళాశాలలో ఒక్కరోజు సెమినార్

భౌగోళిక శాస్త్రం యొక్క ఆవశ్యకత,ప్రాముఖ్యతను నేటి తరం సైన్స్ విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మాసాబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల జియాలజీ విభాగం ఆధ్వర్యంలో ' యాన్ ఇంటర్ డిసిప్లినరీ అప్రోచెస్ ఆఫ్ జియో సైన్సెస్' అంశంపై ఒక్కరోజు సెమినార్‌ను నిర్వహించారు. సెమినా ర్‌ను సీజీఆర్ డాక్టర్ ఎన్ సాయి భాస్కర్‌రెడ్డి, ఎన్ఎస్ఐసీ, ఎన్‌జీఆర్ఐ జియోస్కాలర్స్ గ్రూప్ జీఎం రిటైర్డ్ డాక్టర్ విష్ణుమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత ప్రారంభించారు. ఇటువంటి సెమినార్‌లను నిర్వహించడం వలన వక్తలు తమ జ్ఞానాన్ని తెలుపడంతో భౌగోళిక శాస్త్రంపై విద్యార్థులకు మెళకువలను పెంపొందుచుకోవచ్చని అన్నారు. **- సుల్తాన్‌బజార్,డిసెంబర్ 15**

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శుక్రవారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ కోరారు. వివిధ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం సభ్యులు సత్యనారాయణ, లక్ష్మయ్య, నగేశ్, సాయి,రాహుల్ ఉన్నారు.

- రవీంద్రభారతి, డిసెంబర్ 15

ఘనమైన మెట్లబావి

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 15 : మెట్ల బావులకు ఘనమైన చరిత్ర ఉందని హైదరాబాద్ డిజైన్ ఫోరం ప్రతినిధి యశ్వంత్ రామమూర్తి తెలిపారు. హైదరాబాద్ డిజైన్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మాసాబ్‌ట్యాంక్‌లోని వర్శిటీ ఆడిటోరియంలో ' ది ఫర్‌గాటెన్ స్టెప్‌లెన్స్ ఆఫ్ తెలంగాణ ' గ్రంథావిష్కరణ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 200 దాకా మెట్ల బావులు ఉన్నాయని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కవితా దర్యానీరావు అన్నారు.

యాసిడ్ తాగి యువతి ఆత్మహత్య

మెహిదీపట్నం, డిసెంబర్ 15 : యాసిడ్ తాగి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆసిఫ్‌నగర్ పీఎస్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ జేమ్స్‌స్కూల్ సమీపంలో నివసించే నజీమాబేగం (25) బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో యాసిడ్ తాగింది. ఆమె కొన్ని రోజులుగా మనస్థాపంతో ఉన్నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఉస్మానియాలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చార్మినార్, డిసెంబర్ 15 : మూసీ ప్రవాహంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన హుస్సేనీ ఆలం పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పీఎస్ పరిధిలో మూసీ ప్రవాహంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ఎక్కడి నుంచి వచ్చిందో గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. పరివాహక ప్రాంతాల్లో విచారణ నిర్వహిస్తున్నామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరుస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : పార్కుచేసిన బైక్‌లను అపహరిస్తున్న ఇద్దరిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ నితికా పంత్ కథనం ప్రకారం.. జియాగూడలో నివాసముండే కొంచం కోటి అలియాస్ ఈశ్వర్ పాతనేరస్తుడు. ఇతనిపై 13 కేసులున్నాయి. అదే ప్రాంతంలో ఉండే బైక్ మెకానిక్ ఎండీ యూసుఫ్‌కు స్నేహితుడు. ఇద్దరు పొద్దుపోయిన తర్వాత పార్కు చేసిన బైక్‌లను అపహరిస్తూ తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇటీవల మాసాబ్‌ట్యాంక్, గుడిమల్కాపూర్ ఠాణాల పరిధిలో రెండు బైక్‌లు చోరీ కావడంతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ బృందం వారి వద్ద నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు తదుపరి విచారణ కోసం మాసాబ్‌ట్యాంక్ పోలీసులకు అప్పగించారు.

ఎక్సైజ్,పర్యాటక శాఖల మంత్రిగా నియమితులైన జూపల్లి కృష్ణారావుకు తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ జాక్ చైర్మన్ గోల్కొండ సతీశ్ శుభాకాంక్షలు తెలిపారు. జాక్ అడిషనల్ సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేశ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, సభ్యులు చెట్టి శ్రీనివాస్, చందు, సాయినాథ్ రెడ్డి,సతీశ్ పాల్గొన్నారు. **- సుల్తాన్‌బజార్,డిసెంబర్ 15**

అయ్యప్ప మహాపడి పూజలో..

అయ్యప్ప మహాపడి పూజలతో భక్తి భావం పెరుగుతుందని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ధూల్‌పేట్‌లోని గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేశ్‌సింగ్ నివాసంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మైనంపల్లిని సన్మానించారు. కార్యక్రమంలో మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, బీఆర్ఎస్ నాయకులు ఎస్. ధన్‌రాజ్, శాంతిదేవి, శశిరాజ్ సింగ్, రాజేశ్‌సింగ్ పాల్గొన్నారు. **- అబిడ్స్, డిసెంబర్ 15**

వార్షికోత్సవం

శంకర ఫౌండేషన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో సంస్థ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వక్తలుగా జస్టిస్ పి.నవీన్‌రావు, ఎన్.రాజ్యలక్ష్మి, శ్రీదేవి ప్రసాద్ విచ్చేశారు. దివ్యాంగులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు శ్రీదేవి ప్రసాద్ పాల్గొన్నారు.

- రవీంద్రభారతి, డిసెంబర్ 15

తాళ్లగడ్డలో ఉన్న నాభిశిల బొడ్రాయి ఆలయం పునఃప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు తాళ్లగడ్డ యువజన సంఘం సభ్యులు తెలిపారు. వేద పండితులు హరిహర శర్మ బృందం శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తాళ్లగడ్డ హనుమాన్ ఆలయానికి ఎదురుగా 100 ఏండ్ల నాటి బొడ్రాయి ఉందని, ఆలయం అభివృద్ధి చేసి పునర్నిర్మించేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు. జనవరి 4 నుంచి 7 వరకు నాభిశిల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తామన్నారు. **- కార్వాన్, డిసెంబర్ 15**

ఐక్యతకు నిదర్శనం

చార్మినార్, డిసెంబర్ 15 : పాతనగరంలో మత సామరస్యంతో ఉత్సవాలను జరుపుకుంటారని దక్షిణ మండల డీసీపీ సాయిచైతన్య తెలిపారు. శుక్రవారం హుస్సేనిఅలం పీఎస్ పరిధిలోని జామియా నిజామియా ఆవరణలోని దర్గాలో ఉర్సు ఏ షరీఫ్ ఉత్సవాల సందర్భంగా డీసీపీ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో హుస్సేని అలం ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

సుల్తాన్‌బజార్,డిసెంబర్ 15 : ఉద్యోగానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బేగంబజార్ పీఎస్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ నమిండ్ల శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్‌లోని పటేల్ హోటల్ ఓం శాంతి నగర్ ప్రాంతానికి చెందిన ఎన్.వినోద్, మానస భార్యాభర్తలు. వారు ఉద్యోగులు. వినోద్ సిద్దంబర్ బజార్ రాజధాని హోటల్ సమీపంలోని కొలిన్స్ మార్కెటింగ్‌లో ఉద్యోగం చేస్తుండగా, మానస టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నది. వినోద్ 11వ తేదీన ఉద్యోగం నిమిత్తం ఇంట్లో నుంచి బయలుదేరి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో భార్య మానస అతడు పని చేసే ఆఫీసు వద్ద వాకబు చేసింది. పనికి వచ్చి బ్యాగును ఉంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడని తెలుసుకున్నది. పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ ఆఫ్ అవడంతో శుక్రవారం బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.